మూకసౌందర్యం

కా. సోమేశ్వరరావు

“అచ్చం ఇంటల్లుడిలాగా తిరుగుతున్నాడండీ ముచ్చటగానూ ఆ మూడు ముళ్ళూ పడితే మేమూ కళ్ళారా చూస్తాం” అంటూ వంటచేసే గంగా భాగీరథి బహు సంబరపడ్డది

సూర్యనారాయణకి కోపం బుసబుసమని పొంగుకొచ్చి కనుబొమలమధ్య పాములా మెలికలు తిరిగింది.

అత్తగారు ఊరుకోకుండా - “పుట్టినప్పుడే వాళ్ళిద్దరికీ దేవుడు రాసిపెట్టాడు కోటమ్మా” అంది

వల్లో చిక్కుకున్న చేపలా విలవిలలాడిపోయాడు. వాళ్ళ నేమనాలో తెలీటంలేదు వాళ్ళమాటలు వింటుంటే ఒళ్ళంతా మండిపోతున్నది తన అసమర్థత సూతగా తీసికొని వెళాకోళం చేస్తున్నట్టుగా తోచిందతనికి నిజంగా ఏడుపొచ్చింది ఉడుకుమోత్తనం వేసింది ఉక్రోషం వచ్చింది. చిరాకూ, విసుగూ, నిర్లక్ష్యం, ఏవగింపూ, కంటగింపూ ఇంకా ఎన్నో ఆ క్షణంలో అతగాడి హృదయంలో ఆతిథ్యాన్ని స్వీకరించాయి.

ప్రపంచంలోని సర్వశక్తులూ ఏకమై ‘సూర్యనారాయణ భార్య సీత’ అని సిద్ధాంతీకరించినట్టుగా తోచింది

కాలేజీకి వెడుతూ తప్పనిసరిగా అత్తవారింటో దిగవలసి వచ్చింది లేకపోతే మాతి బిగింపులూ మాట పట్టింపులూ, మట్టిగడ్డలూ వచ్చి చల్లటి సంసారాల్లో అగ్ని రగుల్కొంటుంది.

కాబోయే తన సహధర్మచారిణివైపు చూశాడు. ఎంత ఏవగింపున్నా, హృదయంలో ఓమూల జాలివేసింది తనిందాక భోజనంచేసి పారేసిన ఎంగిలి విస్తరాకు ఎత్తి పారేస్తున్నది అసహ్యించుకోకుండా మనసుకు చాలా కష్టమనిపించింది తన కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ తనకోసం ఒక స్త్రీ సర్వార్పణ చేస్తుందనుకొనేసరికి అతనిలో ఎన్నో మధురభావాలు ముద్దకట్టాయి అట్టి త్యాగమయీ, రాగమయీ దొరికితే తన కింకేమి కావాలి? వివాహంనాడు మోగే మంగళప్రదమైన వాద్యాల ఘోష చెవుల్లో - కాదు - మనసులో ధ్వనించింది ఆ క్షణ మెప్పుడొస్తుందో.

ఆ స్త్రీ సీత అని మాత్రం సూర్యనారాయణ త్రికరణశుద్ధిగా ఊహించుకోలేకపోయాడు. ఏ కోశానా లేశమైనా అందంలేని మనిషి. సౌకుమార్యం లేనేలేని పల్లెటూరి మొద్దు పరాయివూళ్ళో ఎక్కడైనా ఉద్యోగమైతే ఈ గిలకమొహాన్ని వెంటేసుకొని ఎలా వెళ్ళడం ఇది తీరనిసమస్యైపోయిందతనికి అందమైన భార్య కావాలనుకోవడంలో అసహజమేముంది? అలా కోరుకోకపోటానికి తనకేమిలోటుంది గనక. “సరే అబ్బాయీ! నీకు మేనరికం ఇష్టం లేకుంటే మానె వెళ్ళి ఒక అందమైన అమ్మాయిని తెచ్చుకో నీయిష్టం” అని నాన్న తనకు వదిలేస్తే ఏంచెయ్యాలో కూడా అతనికి తోచలేదు ఏ అందమైన ఆడదొచ్చి ‘నన్ను పెళ్ళిచేసికో’మంటుంది ఈ సంబంధం కాకపోతే తనబంధువుల్లో కూడా మరెక్కడా లేవు నవకట్నాలపేచీ తను పెట్టుకోదలచుకోలేదు తనెవరైనా ప్రేమించాడా అంటే అదీలేదు. ప్రేమించి పిచ్చెత్తిపోయి విరహగీతాలు పాడుకొనే తత్వంకూడా కాదు తనది. తన చదువు చూచి ఏ ‘అందమైన కూతురున్న మామగారైనా’ వచ్చి తనని అల్లుడిగా చేసికోటానికి కష్టపడతాడేమో అనుకోటానికైనా తన చదువు ఇలా తగులడిందాయెను. ‘బోడియప్పే’ అన్నట్టు ఆ వెధవ సచ్చిన ‘యప్పే’ ఇంకొ తన్ను వదలకుండా ప్రతివీణ్ణమూ మహా హంగామాగా పూజలు జరిపించుకుంటూ ప్రసాదంలేకుండా పంపించేస్తున్నది. పోనీ తన్నిచూసి ఎవతైనా ఆకర్షింపబడి వెంట పరుగెత్తొచ్చేటందుకు తనేమంత నవమన్మధుడూ కాకపోయె. అత్తగారన్న మాటలు ఇంకా వినిపిస్తూనే ఉన్నవి. ‘ఆ పాపిష్టిదేవుడు మేమిద్దరం పుట్టినప్పుడే రాసిపెట్టాడుట! ఏమంత తొందరొచ్చింది’ అనుకున్నాడు. గుండెలోపల అతిజాగ్రత్తగా ఏడిచేశాడు చేసేదేమీ లేక.

తన్నెప్పుడైనా, కనీసం మాటవరసకైనా, మర్యాదకైనా, అత్తగానీ, మామగానీ అడిగారా ‘ఏంనాయనా పిల్ల నచ్చిందా’ అని? పైగా ‘నచ్చకేంజేస్తుంది రాసిపెట్టింతర్వాత.’

ఈ మనుష్యులని ఆ రాసిపెట్టిన దేవుణ్ణీ కలిపి కసిదీరా తిట్టుకున్నాడు.

తనతల్లికీ సంబంధం ఎప్పుడూ ఇష్టంలేదు. ఈ అనాకారిని చేసుకోటం ఆమెకు సుతరామూ ఇష్టంలేదు. అయినా, అందరు అమ్మలకుమల్లేనే కట్టుకున్న మొగుణ్ణి కాదనటం నేర్చుకోని కారణంగా లోపలి భావాలూ, కోరికలూ పైకిరాకుండా లోపలనే దిగమింగుతూంటుంది కొడుకేదో వెలిగిస్తాడనీ, వాడికి చక్కటిభార్య రావాలనీ ఆ కోడలు తనకు చివరి రోజుల్లో సహాయం చేస్తుందనీ కలలుగంటూ పిచ్చితల్లి తనసుఖం కోసం తల్లడిల్లిపోతుంటుంది

పరిస్థితుల నెదిరించి ఆశయాలను కొనసాగించుకోటం పుస్తకాల్లో చదివి మెచ్చుకోవలసిందే గానీ, నిజంగా ఎదురొక్కవలసి వచ్చినప్పుడు చూపించవలసిన కార్యశూరత, కఠోరత తనలో లేవని, అసలు ఇంటా వంటా లేవని అతను నూటపదకటో సారిగా అనుకున్నాడు. ‘నాకీ సంబంధం అక్కర్లేదు నాకు నచ్చిన పిల్ల దొరికిందాకా బ్రహ్మచారినై ఉంటా’నని తండ్రితో చెప్పేయగలిగిన ధైర్యం లేదని గ్రహించాడు. తండ్రిదగ్గర ఎప్పు డెదిరించవలసివచ్చినా పిల్లైపోతాడు నిష్కళంకమైన ప్రేమానురాగాల్ని ఎదిరించే శక్తి తనకు లేదు. ఆయన కూడా చాలా మొహమాటస్తుడు. ‘ఒకే కడుపున పుట్టాం. పుట్టిన అయిదుగురిగ్గానూ ఎలాగో మేమిద్దరం మిగిలాం వయసు చెల్లిన ఈ కాలంలో మా యిద్దరికీ మధ్య మనస్పర్థలు రేపుకోవడం దేనికంటాడు. అన్నీ ఎరిగిన అత్త ఎపుడూ ఆయన అభిమానం కదుపుతూ, మరెక్కడా సంబంధాలు వెతక్కుండా ఆయన కళ్ళకు కాపలా వేస్తుంది.

చితికిపోయిన సంసారాలు పరిశీలిస్తే అతనికి దొరికిన ముఖ్యమైన కారణం భార్యాభర్తల మధ్య పెరిగే వైమనస్యాలు. తనూ అలాగే - అందరికిమల్లే తృప్తిలేని నికృష్ట జీవితం గడుపుతూ ఛ, ఛా—అలా ఎప్పటికీ జరగకూడదు ధైర్యం కూడగట్టుకొని నాకీ సంబంధం నచ్చలేదని ఎలాగైనా నాన్నగారితో చెప్పేస్తా. ‘ఈ సీత పుట్టకపోయినా బాగుండును’ అనుకొని సీతను తన దృష్టిలోనుంచి మాయంచేసి అప్పటి పరిస్థితు ల్నూహించుకొంటున్నాడు

‘సూరి బావా!’ సీత గొంతు క్లిష్టమైన అతని ఊహాపథంలోకి చీల్చుకుని వచ్చింది. ఉలిక్కిపడి చూశాడు. ఆ మాటల్లోని తీయ

★ మూక సౌందర్యం ★

విషయంలో తనకు నమ్మకమున్నా తప్పు చేసి సరిదిద్దుకుంటున్న వాడిలా ప్రయత్నించి మనసు రాయిచేసికొని

'ఏం' అన్నాడు.

'నీ కింకా ఎన్నేళ్ళ చదువుంది'

'ఇంకా రెండేళ్లు.'

'అబ్బా' అని సీత ఆశ్చర్యపడిపోయింది. నిజానికి ఆ గడువు భరించరానిదిగా తోచింది ఆమెకి. వెంటనే అంది:

"పెద్ద చదువన్న మాట! అయినా నాకేం తెలుస్తుంది కనక, పల్లెటూరిదాన్ని"

సూర్యనారాయణమనస్సు చివుక్కు మంది. కోపం కూడా ఎత్తుకొచ్చింది. అది తన ఉద్దేశంలో అనాగరకురాలయిన సీత పై అసహ్యంగా పరిణమించింది. ఆత్మన్యూనత చేసికొనే వాళ్లని అతను ఎప్పుడూ ఓదార్చకుండా ఉండలేడు

"అన్న మాటే గాని, నాకంటే నీకే ఎక్కువ తెలుసు. నాలు గింగ్లీషు కూతలు కుయ్యగానే పల్లెటూరివాళ్లు బ్రహ్మరథం పట్టేస్తారు" ఈ మాటలు సూటిగా ఆమెను తగిలాయేమో అనుకొని బాధపడ్డాడు. సీత కళ్లల్లోకి చూశాడు. ఉత్త గాజుకళ్ళల్లా ఉన్నాయి. తను కాంక్షించే అనంతాకాశం నిలినీడలు ఎక్కడా గోచరించలేదు. తనంటే ఏదో మూఢమైన విశ్వాసం, భక్తి కాని పాకుళ్ళ వేదనం కనుపించాయి. తన మాటల్లో కొంత జాలికూడా ఉన్నట్టు గమనించాడు. అందులో 'నే నెలాగూ నిన్ను చేసికోవడం లేదుగదా. ఎందుకు నీ కింకా ఈ ఆశలూ అభిమానాలూ?' అన్న అర్థముంది మొత్తానికి ఆ యింట్లో వాళ్లందరూ తనంటే మితిమీరిన గౌరవం చూపుతూ, "బావా, బావా" అంటూ సీతా, అల్లుడల్లుడంటూ మామా, అత్తా తెగపూసుకొని తిరుగుతూ తన్ను వల్లో వేసికోవాలని చూస్తున్నారు. ఈ నటన అతనికి చిరాకెత్తించింది.

'మళ్ళా సెలవ లెప్పుడు బావా.'

ఈ మాటల్లో గూడా అతనికి నటన గోచరించి ఎక్కడలేని అసహ్యం వేసింది

'మళ్లా మళ్లా రానికా. ఎంతాకాలం సెలవులకే' అదోమాదిరి కోపస్వరంతో అన్నాడు.

శపించినట్టుగా తోచింది సీతకి. లోపల ఆ స్వరకాఠిన్యతకు బాధపడింది. బావకు తనంటే ఎందుకు కిష్టం లేదో తనందంగా లేదని ఆమె అనుకోలేకపోయింది. కాని తన కళ్ళకి బావ మన్మథుడిలా ఉంటాడు. ఇంతలో తల్లి కేకేస్తే, సీత వెనక్కు తిరిగి వెళిపోయింది. ఆమెను చూస్తూ తలుపు కానుకొని నిలబడ్డాడు సూర్యనారాయణ.

అది గమనించిన సీత అడుగులు తొట్రుపాటు చెందాయి.

* * *

'నా పెళ్లి కప్పుడే తొందరేమిటి. చదువు పూర్తయినతరువాత గానీ చేసికోను' అంటూనే ఒక సంవత్సరం ఆ ప్రస్తావన రానీకుండా గడుపుకొచ్చాడు సూర్యనారాయణ. ఒక రోజున అనుకోకుండా నాన్నగారివద్ద నుంచి జాబొకటి వచ్చింది. 'పెళ్ళి కన్ని ఏర్పాట్లూ అయినాయ్ ఈ శ్రావణంలోనే మంచిముహూర్తముంది నువ్వు సెలవుపెట్టి రావలసింది' ఇదీ సారాంశం.

బాగా ఎరిగున్న స్నేహితుడొకడు సేవకూడా కావచ్చు సూర్యనారాయణని రైలెక్కించి ముహూర్తంనాటికి తప్పకుండా వస్తానని మాట ఇచ్చాడు. ఓదారుస్తూ అన్నాడు స్నేహితుని బాధ గ్రహించి

"అందం కొరుక్కు తింటావా అలా అని కురూపిని చేసికొమ్మని నా ఉద్దేశం కాదు. మీ అత్తకూతురు అంత కురూపి అంటే నే నెందుకో నమ్మలేకుండా ఉన్నాను. ముఖాని కందం లేకపోయినంతమాత్రాన మనసు మంచిదీ గాదని అనటం తప్పు నన్నడిగితే మనస్సుకు కూడా సౌందర్యం ఉంటుంది. దాన్ని గుర్తిస్తేనే కాని జీవితం సఫలమౌతుంది. అందం రేపు నశిస్తుంది కాని ఆ సౌందర్యం కలకాలం నిలుస్తుంది"

'ఏమిటో ఈ వేదాంతం' అనుకున్నాడు సూర్యనారాయణ మనస్సులో తీవ్రమైన అసంతృప్తి చెలరేగుతున్నది. తనకు సీతమీద ఉండే విముఖత్వం సంసారంలో రాబోయే తుపానుల నూహించుకొని అతని మనస్సు ఆందోళన పడసాగింది తను భావన చేసికొంటున్న ఊర్వశి వచ్చి కడపటిక్షణంలో రక్షిస్తుందేమో అనుకున్నాడు. కాని పెళ్ళి బాజాలశబ్దంలో ఆ ఆశకూడా అంతరించిపోయింది.

విషయం తన చెయిదాటిపోయిందన్న సంగతి నాన్నగారు తన్ను సంప్రదించకుండా రాసినఉత్తరంతోనే తేలిపోయింది. ఒక్కసారైనా నాన్నకీ, అమ్మకీ తన అయిష్టత వ్యక్తంచేయటం కనీసధర్మంగా భావించి తెగింపుచేసి ముహూర్తం ముందు రోజు నాన్న వింటుండంగా తల్లిముందర నోరు జారాడు. 'నాకీసంబంధం ఏమాత్రం నచ్చలేదు. నన్నడక్కుండా ఎందుకు తలపెట్టారు పెళ్ళి నాకొద్దీ మీకో' అని

ఆయన ఆగ్రహోదగ్రుడైపోయాడు పెదిమలు వణికిపోయాయి ఎఱ్ఱబడ్డ కళ్ళల్లోంచి దెబ్బతిన్న అభిమానం కన్నీరై కారిపోయింది. 'ఫో నీయిష్టమైనచోటికి వెళ్ళి నీయిష్టమైనదాన్ని చేసికో నేనేమీ అన్ను. సినిమా తారలను పోకిళ్లాలను తెచ్చి వంశం భ్రష్టం చెయ్యలేను' ఆ రౌద్రమూర్తి అంతలో ద్రవించిపోయ్యాడు దగ్గరకొచ్చి కౌగిలించుకొని జుట్టు నిమురుతూ "చదువుకొన్నవాడివి నువ్వూ అలా అంటే ఎలా చెప్పు నాయనా! పోషణలేక, తగిన చదువు లేక అలా ఉందిగానీ మహాలక్ష్మిలా ఉంటుంది. దాని హృదయం నీకింకా తెలీదు" అన్నాడు తనూ తండ్రి కౌగిలింతలో తల దాచేసుకొని ఏడిచాడు

ఇంతలో అత్తగారెగో పనిమీదొచ్చి ముగ్గురూ చెమ్మగిల్లిన కళ్లతో ఉండటం చూసి గిరుక్కున వెనక్కి వెళ్ళిపోయింది.

* * *

అగ్నిసాక్షిగా సీత సూర్యనారాయణ భార్యైపోయింది. చాలా ముభావంగా గడిపాడు అంత హడావిడిలోనూ. చాలా మంది ఆశ్చర్యపోయారు. అతను తిరుగా కాలేజీకి వెళిపోయాడు. మళ్లా స్నేహితుడన్నాడు 'అందమెందుకు కొరుక్కు తిన దానికి పట్నవాసంలో పెరిగిన నీకు పల్లెటూరి మొహాలు బాగుండకపోవచ్చు గానీ, మీ యిద్దరికీ ఈడూ జోడూ కుదిరిందనే నాకనిపించింది'

'నీకో శూర్పణఖ దొరికితేనే గానీ ఈ వేదాంతం మానవు' అన్నాడు సూర్యనారాయణ.

అందంలేని స్త్రీని నిజంగా ప్రేమించడం మహాసాధనచేస్తేనే గానీ నాలాంటివాళ్ళకు చేతగాదు నా జన్మనక్షత్రం బద్ధలైపోయి దాని ప్రభావమేదైనా నామీదుంటే తప్ప నేను సీతను ప్రేమించలేను అనుకున్నాడు. తీవ్రమైన అసంతృప్తి అతని మనస్సులో దావానలంలా వ్యాపించి,ఆక్రమించి దహించేసోంది 'అందం లేదు అందం లేదు' గుండెల్లో ప్రతిధ్వనులిస్తున్నాయి 'పిశాచిలా నాపక్కని కూర్చుంది' అనుకున్నాడు ఫొటో చూసి.

ఈ మొహానికి జాబొకటి 'ప్రియమైన సీతా! నీకు నా ముద్దులు' ఒక్క నాటి ఎక్కడలేని నవ్వూ ముంచుకొచ్చింది. వెంటనే అసహ్యం తుపానులా లేచింది. ఛీ, ఛీ ఈ మొహాన్ని ముద్దు పెట్టుకోవటం ఎలాగ మనస్సును ముద్దు పెట్టుకోవాలి. తన్ను తాను సమాధానించుకొని నవ్వుకున్నాడు పాఠాలమీదకి బొత్తిగా మనసు పోవటంలేదు. ప్రతి అక్షరం మధ్యా అందం లేని సీత మొహం కనపడి అసంతృప్తి, అసహ్యం రేకెత్తిస్తున్నది సతికి జాబు రాదామని నాలుగైదుసార్లు ప్రయత్నించి రాయలేక విసుగెత్తి విరమించుకున్నాడు మనసులోని మధుర భావాలూ జాబులో 'ప్రియమైన ' 'కి ప్రాధానుకొన్న ఆశలన్నీ వ్యర్థమైపోయినాయ్

కష్టపడి యస్. ఏ. ప్యాసై సూర్యనారాయణ బి. యే లో కొచ్చాడు. ఆ సంవత్సరం క్రిస్మస్ సెలవులకి ఇంటికి వెళ్ళాడు. రైలో! ఎక్కుతున్నప్పుడే ఒళ్ళు వేడెక్కి కీళ్ళల్లో బలహీనత గోచరించింది. రైల్లో పిచ్చిపిచ్చిగా ఆలోచిస్తూ కూర్చున్నాడు 'ఏదన్నా పెద్ద జబ్బుచేసి, లేక గుండె హఠాత్తుగా పగిలిపోయి నేను చచ్చిపోగూడదూ' అనుకున్నాడు. పెథవ ప్యాసింజరు రైలు మూడుగంటు లాలస్యంతో తన వూరికి మధ్యాహ్నం పన్నెండు గంటలకి చేరింది. ఆవేళ ఆ స్టేషన్‌లో తను తప్ప మరెవ్వరూ దిగలేదు. ఆ స్టేషన్ ఏదో ఎడారిలో ఉన్నట్టు భావించాడు. జట్కాలో యింటికి బయలుదేరాడు. తెగిపోయిన జుట్టూ, మసిబారిన బట్టలూ, పీక్కుపోయిన మొహం తనమీద తనకే అసహ్యం వేసింది కళ్ళు చిమ-చిములాడిపోతూ మండుతున్నాయి. ఆ పరిస్థితుల్లో అతనికో భావం వచ్చి గుండె గతుక్కుమంది. వెంటనే తనలో తాను నవ్వుకున్నాడు. ఆ కాళరాత్రి ఒంటరిగా బండిలో ప్రేమించిన పార్వతి కడసారి దర్శనంకోసం ప్రయాణిసూ రక్తం కక్కుకొని, దిక్కులేక మరణించిన దేవదాసు జ్ఞాపకం వచ్చాడు తనూ అల్లాగే మరణిస్తే ఎంత బాగుంటుంది. తనింకా ఊహించుకొనే లోపల గమ్యస్థానం వచ్చి జట్కా ఆగిపోయింది నెమ్మదిగా దిగి ఇంట్లో కొస్తుంటే గుమ్మందగ్గిర సీత ఇంత కుంకుమబొట్టు పెట్టుకొని నిల్చునిఉంది తలొంచుకొని పలకరించకుండా లోపలి కెళ్ళి మంచం లాక్కుని వాలిపోయ్యాడు.

సాయంత్రం అయిదింటికి కళ్ళు విప్పి చుట్టూ వాతావరణాన్ని అర్థం చేసికోటానికి ప్రయత్నించాడు ఆ యింట్లో అందం లేని భార్య ఉన్నట్టు అతనికి గుర్తొచ్చింది మళ్ళీ ఎన్నో భావాలు అతని మనస్సులో దట్టంగా అలుముకొన్నాయ్ అందమైన భార్య ఉంటే ఈ జ్వరం వచ్చిఉండేది గాదేమో అనుకున్నాడు వచ్చినా తన కెన్ని విధాల సేవలు చేస్తుందో ఊహించుకొంటుండగా సీత వచ్చి కాఫీ కప్పు మంచంపక్కనే ఉన్న బల్లమీద పెట్టింది దగ్గరకొచ్చి నుదుటిమీద చేయి వేసి చూసింది అతని నుదురు ఆమెకు భగ్గుమని మండిపోతున్నట్టనిపించింది ఆమె చేతిస్పర్శకూడా సూర్యనారాయణకు భగ్గుమనిపించింది అందమైన భార్య చేయైతే చల్లగా ఉండేదనుకున్నాడు కాఫీ తాగకుండానే ముఖం [illegible] తిప్పేసుకొని పడుకొన్నాడు

మర్నాడు ప్రొద్దున్నే కళ్ళు విప్పి చుట్టూ కలయచూశాడు చిన్నతనంలో చదువుకొన్న రూమది ఏవేవో స్మృతిపథంలో మెలిగాయ్. వళ్ళారి విక్కువిక్కుతుంటూన్న కాఫీ కప్పు కనిపించింది. ఏదరికో అన్యాయం చేసినట్టు తోచింది రాత్రి విషయాలన్నీ లీలగా జ్ఞాపకమొస్తున్నయ్ అమ్మ గొంతుకలా ఉంది ఎందుకో ఏడుస్తున్నది. ఎందు కేడిచివుంటుంది. ఈ కొ్జ్వరానికే. పాపం. తల్లిహృదయం అంత మెత్తనిది కాబోలు. దిండుమీద దురద పుట్టింది. ఏదో పొక్కు లాగుంది. చేతిమీద చాలాచోట్ల ఉన్నాయి గుండెలమీదా మొహంమీదా, అరె. రాత్రికిరాత్రి ఎక్క



★ మూకసౌందర్యం ★

క్షించి ఒచ్చాయి పొక్కులు. గుండె గతుక్కుమంది. భయం విద్యుద్వేగంతో ఒళ్ళంతా ప్రసరించింది. ఏమిటిది మశూచికం కాదుగదా ఉండబటలేకపోయాడు. 'అమ్మా' అని కేక వేశాడు. తల్లి వచ్చింది విత్తరచూపులు చూస్తూ. 'ఏం నాయనా. బాగా నిద్దరపట్టిందా' 'ఇదేమిటమ్మా' అన్నాడు. 'ఏదో విషజ్వరం నాయనా. మరేం ఫరవాలేదు. తొందర్లోనే నిమ్మళించిపోతుంది'

'ఇది మశూచికం కాదూ'—దివ్యవీణా నినాదంలో అపశ్రుతి పలికినట్టుందా స్వరం.

అతని దృష్టి మందగించింది. ఆ రూముగోడలు గిర్రని పరిభ్రమిస్తున్నయ్. అగ్నిపర్వతాల చివళ్లు పేలి పొగలు కక్కుతున్నట్టనిపించింది. కింద భూమి చీలిపోయి, అగాధాలేర్పడి-తనా అగాధాల్లో మంచంతోపాటు విసిరివేయబడుతున్నట్టుంది. ఒళ్లు కంపించింది. కళ్లువిప్పి తనఒళ్లు చూసుకొన్నాడు. అనుకొన్నంత ఘోరంగా ఇంకా శరీరం మారిపోలేదనుకున్నాడు. ఎఱ్ఱబడ్డ కళ్ళల్లోంచి ఇందుపగింజల్లాంటి నీటిబొట్లు టపటప రాలిపోయాయి. 'పాపిష్టి దేవుడా! నువ్విచ్చినఅందాన్నే తిరిగి తీసుకొంటున్నావటయ్యా! ఎందుకింతకోపం. ఏంచేశాను చేసేంచేశాను. నీకెందుకింత నిర్దయ భగవాన్.' దిండులో తలదాచేసుకొని అవమాన భారంతో ఏడిచాడు.

'అందం భరించలేని అసూయా దేవత ఈ మశూచికం. ఒళ్ళంతా బీభత్సంగా తయారయిపోతుంది. మచ్చల్తో ఒళ్లంతా సందు లేకుండా నింపేస్తుంది. శాశ్వతంగా నున్నటి ఈ మొహం గతుకుగతుకులైపోతుంది ఇహ నన్నే ఆడదీ చిరునవ్వుతో చూడదు

సీత వేపమండతో వీస్తూ పక్కన నిలబడింది. బలవంతంగా రెప్పలు పైకెత్తి సీత మొహంలోకి చూశాడు. 'ఎంత అందంగా ఉంది' అత నాశ్చర్యపోయాడు. 'ఇన్నాళ్ల వరకూ ఎక్కడ దాగివుందీ అందం. ఎంత దౌర్భాగ్యుణ్ణి. "ఆ పచ్చటి చీరలో ఎలా మెరిసిపోతున్నదో సీత. ఆ కుంకుమబొట్టు కూడా ముఖాని కేదో కళ అపాదిస్తున్నది ఆ పల్చటి ఎఱ్ఱటి పెదవులూ, సూర్యకిరణాల్ని ఇంద్రధనస్సు ఏడురంగుల్లోకి విరజిమ్మే ఆ కళ్లూ ఎంతబావున్నాయి. నాదేమి అందం ఇంక నాలుగురోజులవరకూ ఉంటుంది. తరువాత నాతోపాటే నశించిపోతుంది. మశూచికం వచ్చినవాళ్లు సాధారణంగా బ్రతకరు' అతని కళ్లు చెమ్మగిల్లాయి సీతమొహంలోకి నిర్విరామంగా చూస్తున్నాడు అమాయికంగా తన్నుచూసి భయపడిపోతున్నది. అందమైనభార్య అతనికళ్లముందు సాక్షాత్కరించింది. తన్ను చూచి ఏవగించుకుంది. గజ్జికుక్కని తోలేసినట్లు తనని దగ్గరకి రావద్దంటూంది. అద్దంలో తన అందాన్ని చూసి మురిసిపోతున్నది. శవాన్ని చూసినట్లు తన వైపుచూసి పరుగెత్తిపోయింది ఒళ్లంతా ఒక్కసారి ఉలిక్కిపడ్డట్టు కదిలిపోయింది చివరకేం మిగిలిందన్నట్టుగా కళ్లతో ప్రశ్నించాడు సీతని. ఆశించినఅందం తనకు దొరకలేదు సరిగదా తనకు మిగిలిన అందం కూడా అంతరించిపోతున్నది.

ఏదో నరకంలో ఎక్కడా పట్టుదొరక్క జారిపోతున్నాడు. స్వర్గలోకం మణిమయ ద్వారాలు తెరుచుకున్నాయి. సీత బయటికొచ్చి చెయ్యి విసరింది. ఆ వేళ్లుపట్టుకొని పైకెగబాకుతున్నాడు. సీత సౌందర్యం సహస్రగుణాధికమై ప్రకాశించింది. సీత రెండుచేతులూ చాచి పైకి లాగి దగ్గరకి తీసుకుంది.

స్మృతిపథంలోంచి మళ్ళీ విడివడి తన ఒళ్లు చూసుకొన్నాడు. పొక్కులలాగే వున్నయ్. తను చచ్చిపోవటం నిజం. 'నిన్నన్యాయంచేశాను సీతా' అని గొణుక్కున్నాడు. సీత భయపడి లోపలికెళ్ళి అత్తని పంపించింది.

'తిరుపతి వెంకన్న ఎప్పుడూ అన్యాయం చేయడు' ఆ తండ్రికి మొక్కుకో నాయనా మళ్ళియేటికి నీ పాదాలమీద వాల్తానని" తల్లి విశ్వాసానికీ దైవభక్తికీ కదిలిపొయ్యాడు లోలోపల ఆ సర్వశక్తిమంతుడైన పరమేశ్వరుడికి నమస్కరించాడు. మశూచికం పొంగి నట్టే పొంగి తగ్గిపోయింది. తొమ్మిదో రోజున స్నానం చేయించారు. ముఖమేమీ వికృతంగా తయారుకాలేదు. ఎవరూ చూడకుండా అద్దంలో చూసుకున్నాడు. గుండె చాలా తేలికపడ్డది. నిర్మాల్యం తీసేసి తిరుగా స్వామినలంకరిస్తే ఉండే సొగసూ సౌందర్యమూ అతనిలో గోచరించాయి

మన్నాడు తెల్లవారుఝామున నాలుగున్నరకి మెలకువొచ్చి దాహం వేసింది. మరచెంబులోనుంచి నీళ్లొంచుకోబోయి పట్టుజారి కింద బడవేశాడు. ఖంగుమని శబ్దమైంది.

సీత భయపడుతూ లోపలకొచ్చి లాంతరు పెద్దది చేసింది నలుమూలలకూ చెదరిపోయిన కుంకుమబొట్టుతో ఆమె నుదురు అరుణరాగా లలముకొంటూన్న ఉదయాకాశంలా ఉంది

'ఏం బావా ఏం కావాలి'

సూర్యనారాయణకు స్నేహితుడిమాటలు జ్ఞాపకం వచ్చాయి "మనస్సుకి సౌందర్యముంటుంది అది కలకాలం నిలుస్తుంది"

'ఇంకా బావా గివా ఏమిటి' అన్నాడు.

'ఏమనమంటావో చెప్పండయితే'

'అండీ అంటే నా ఒళ్లు మండిపోతుంది'

సీత నవ్వింది. మనస్సులో ఉన్న నిర్మలమైన సౌందర్యం పైకి పొంగి పొరలి తనను చూడమన్నట్టుగా ఉందా నవ్వు.

పక్కకు జరిగి కూచోమన్నాడు కాసేపు సంశయించి మంచంపట్టెమీద కూర్చొంది. సూర్యనారాయణ తన వేళ్ళూ సీత వేళ్ళూ చూసికొన్నాడు తన వేళ్ళమీద ఇంకా మచ్చలున్నాయి

సీత వేళ్లు తన చేతిలోకి తీసికొని 'ఎంత బావున్నాయో చూడు' అన్నాడు

ఆమె మాట్లాడలేదు.

'నే నొక ప్రశ్న అడుగుతా జవాబు చెప్తావా'

'అడగండి'

'నేనింకా అందంగా ఉన్నానా.'

సీత రెండుచేతుల్తో మొహం కప్పెసుకొని ఏడిచింది. ఏదోలోకంనుంచి మాట్లాడినట్టుగా అంది.

'మీ కందమైన భార్య రావాలనే కోరుకునేదాన్ని' 'ఛ, ఛా ఏమ్మాటలవి'

వెక్కి వెక్కి ఏడుస్తూన్న సీతని సముదాయించాడు దగ్గరికి లాక్కొని

'నీ కందం లేకపోయినా ఆత్మసౌందర్యముంది. నాకదే చాలు'

ఆశ్చర్యంతో సీత కళ్లు పెద్దవి చేసింది—మనస్సును చూడమన్నట్టుగా. తరువాతెవరూ చాలాసేపటివరకూ మాట్లాడుకోలేదు. భాష వ్యక్తీకరించలేని ఏదో మధురమైన అనుభూతికి పరవశులై ఇద్దరూ మూగవోయినట్టుగా, ఆ దివ్యానుభవం మాటల్లో ఖర్చైపోతుందేమోనన్నట్టుగా శూన్యంగా దిక్కుల్లోకి చూస్తూ ఉండిపోయారు. ★

రవి టాయిలెట్స్

అందమునకు,
వర్చస్సుకు

సోల్ ఏజంట్లు:—
ది సూర్యప్రకాశ్ & కో., మద్రాసు-21.